సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024



విద్యుత్ వెలుగులు

రోజు రోజుకూ జిల్లాలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్నాయి. దానికి అనుగుణంగా అవసరమైన చర్యలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు చేపడుతోంది. -8లో



నేటి నుంచి అంజన్న బ్రహ్మోత్సవాలు

నందలూరు మండలంలోని కుంపిణీపురం ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. రథసప్తమి సందర్భంగా అంకురార్పణ చేయనున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.160
రెండోరకం	రూ.70	రూ.116

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 110 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	356	473
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 673.440 కిలోలు

న్యూస్‌రీల్

నేడు కౌన్సెలింగ్

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో శుక్రవారం స్థానిక కడప పాత రిమ్స్‌లోని ఆ శాఖ కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌పీల నియామకాల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. ఇందుకు సంబంధించి ఎంపికైన అభ్యర్థుల జాబితాను, ఇతర వివరాలను హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్ సైట్‌లో ఉంచామన్నారు. ఇప్పటికే కౌన్సెలింగ్ సమాచారంను అభ్యర్థులకు తెలియజేసామని తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కౌన్సెలింగ్ ప్రక్రియకు అభ్యర్థులు హాజరు కావాలని పేర్కొన్నారు.

కడపలో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైఎస్సార్ జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్‌లో సరీ్వసు డెలివరీ మేనేజర్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్, నవభారత్ ఫర్టిలైజర్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివి 18–35 సంవత్సరాల మధ్య వ యస్సు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థుల విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు, ఫోటోలు తీసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

కబడ్డీ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడా మైదానంలో 16వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లాస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి ఆర్. వెంకటసుబ్బయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.శ్రీవాణి, జాయింట్ సెక్రటరీ సునీల్ తెలిపారు. వివరాలకు 6304309294 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

18న ఖోఖో జట్టు ప్రకటన

కడప స్పోర్ట్స్: ప్రొద్దుటూరులోని వైఎస్ మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో ఈనెల 18న జిల్లాస్థాయి ఖోఖో సీనియర్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు కె. రామసుబ్బారెడ్డి, కార్యదర్శి జె. నరేంద్ర తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే వారు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. వివరాలకు 9849713690 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

రాయచోటి: పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర ఏజీసీడీఓ మాధురి అన్నారు. గురువారం జిల్లాలోని రామాపురం, రాయచోటిల్లోని కేజీబీవీలను మాధురి సందర్శించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు పంచతంత్ర ప్రణాళికలను, విద్యార్థినీల ప్రగతిని పరిశీలించి విద్యార్థినులకు సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం రాయచోటిలో కేజీబీవీల ప్రిన్సిపాల్స్ అధికారిణులతో జరిగిన సమావేశంలో డీఈఓ శివప్రకాష్ రెడ్డితో కలిసి మాధురి పాల్గొన్నారు. ఈ సమావేశంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినుల గ్రాండ్ టెస్టు–2 ఫలితాలను పరిశీలించారు. పబ్లిక్ పరీక్షలలో కూడా మెరుగైన ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. డీఈఓ మాట్లాడుతూ సరళమైన పద్ధతిలో బోధించాలని సూచించారు.ప్రతి పాఠశాలలో సి గ్రేడ్ విద్యార్థినులను దత్తత తీసుకొని నూరు శాతం ఫలితాలను తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జీసీడీఓ రాధ, డైట్ ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతవిద్య సమ్మిట్‌లో వైవీయూ వీసీ



సమ్మిట్‌లో పాల్గొన్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ: నేపాల్ దేశంలోని ఖాట్మాండ్ విశ్వవిద్యాలయంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న భారత్–నేపాల్ హయ్యర్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పాల్గొన్నారు. అఖిల భారత విశ్వవిద్యాలయాల సంఘం ప్రధాన కార్యదర్శి పంకజ్ మిట్టల్ ఆహ్వానం మేరకు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్‌ఈపీ)–2020, అంతర్జాతీయ స్థాయి విద్య, ప్రపంచవ్యాప్తంగా నాణ్య మైన విద్య, పరిశోధన, బోధన, ఫ్యాకల్టీ/ స్టూడెంట్ ఎక్ఛేంజ్, డిజిటల్ లెర్నింగ్ తదితర అంశాలపై నిర్వహించే సమ్మిట్‌లో పాల్గొని పలు ఎంఓయూలపై చర్చించనున్నారు. ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. దేశం నుంచి 150 విశ్వవిద్యాలయాలు పాల్గొనే ఈ సమ్మిట్‌లో వైవీయూ వీసీకి ఈ అవకాశం లభించడం విశేషం.

వలంటీర్ల సేవలు అమోఘం

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



వలంటీర్లకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

రాయచోటి: గ్రామ స్వరాజ్య స్థాపనలో రాష్ట్ర ప్రభుత్వ ఆశయాల సాధనకు కృషి చేస్తున్న వలంటీర్ల సేవలు అమోఘమని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు అభిప్రాయపడ్డారు. గురువారం గుంటూరు జిల్లా ఫిరంగిపురం నుంచి ఉత్తమ గ్రామ, వార్డు సచివాలయం వలంటీర్లకు సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులను ప్రదానం చేసే కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ కార్యక్రమంలో రాయచోటిలోని స్పందన హాలు నుంచి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, జిల్లా అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు. నేడు పురస్కారాలు అందుకున్న వలంటీర్లు అందరికీ కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. గ్రామంలో ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను చేరవేస్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివన్నారు. బాధ్యతగా విధులు నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. సచివాలయానికి ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్లు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. వరుసగా 4వ ఏడాది ప్రభుత్వం నిర్వహిస్తున్న వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మీ చెంతన ఉండటం, మీతో పాటు గడప గడపకు తిరుగుతున్నపుడు, వలంటీర్లు చేసే సేవలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చెప్పినట్లు ప్రభుత్వం ద్వారా పేదవారికి చేసే మంచి కార్యక్రమాలను ఒక బాధ్యతగా చేయాలన్నారు. అర్హత ఉంటే చాలు అలాంటి వారికి ప్రభుత్వ పథకాలను అందించాలని సూచించారు. సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర వచ్చిన వారినందరినీ అభినందిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి లక్ష్మీపతి, జడ్పీ డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, గ్రామ వార్డు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మెగా చెక్కు ప్రదానం

అనంతరం ఉత్తమ సేవ అందించిన గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర అవార్డు, నగదు పురస్కారాలను, రూ.12,88,20,000 మెగా చెక్కును ముఖ్య అతిథులుగా ప్రదానం చేశారు.

అవార్డుల వివరాలు



- సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు పొందిన జిల్లాలోని మొత్తం గ్రామ వార్డు వలంటీర్లు 8367 మంది
- సేవా వజ్ర నగదు పురస్కారం పొందిన వారు 28 మంది. వీరికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్, రూ.45 వేల నగదు బహుమతిని ప్రదానం చేశారు.
- సేవారత్న నగదు పురస్కారం పొందిన వారు 165 మంది. వీరికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ.30 వేల నగదు బహుమతి ప్రదానం
- సేవామిత్ర నగదు పురస్కారం పొందిన వారు 8174 మంది. వీరికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్, రూ.10 వేల చొప్పున నగదు బహుమతి ప్రదానం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



మంచి ఉద్దేశంతో ప్రజలందరికీ మంచి జరగాలనే ఆశయంతో గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి.. వలంటీర్లుగా మమ్మల్ని నియామకం చేసి, ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ప్రజాసేవలో జగనన్న సైనికురాలిగా నేను ఉండటం... ఈ రోజు సేవా వజ్ర, నగదు పురస్కారం అందుకోవడం ఎంతో గర్వంగా ఉంది.
– ఎం.పద్మజ, నక్కలవాండ్లపల్లె, డి.అబ్బవరం, రాయచోటి మండలం

సమాజంలో గౌరవం దక్కింది



రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్లను అవ్వ తాతలకు అందించడంతో పాటు వివిధ సంక్షేమ పథకాలపై వారికి అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో వలంటీర్లుగా సమాజంలో మాకు ఒక గౌరవం కల్పించిన ముఖ్యమంత్రికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు.
– ఏ.రాజేష్, మాసాపేట, రాయచోటి సేవారత్న నగదు పురస్కార గ్రహీత

ప్రభుత్వ ఆశయ సాధనకు కృషి



చదువుకున్న నిరుద్యోగ యువతకు గ్రామంలో స్వచ్ఛందంగా, నిస్వార్థంగా ఒక వలంటీరుగా సేవ అందించే భాగ్యాన్ని ముఖ్యమంత్రి మాకు ప్రసాదించారు. దేశంలోనే సచివాలయ వ్యవస్థకు మంచి పేరు రావడం మాకు గర్వంగా ఉంది. అర్హత ఉన్న ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వానికి సహకారం అందిస్తూ... జగనన్న సైనికులుగా.. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా విధి నిర్వహణ చేస్తాం.
–టి.నాగమునెమ్మ, రాయచోటి, సేవా మిత్ర పురస్కార గ్రహీత

ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల పాత్ర కీలకం

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించడంలో నోడల్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అన్నారు . గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో నియోజకవర్గ రిటర్నింగ్, నోడల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లాస్థాయిలో నోడల్ అధికారులను నియమించినట్లు చెప్పారు.అధికారులు ఎన్నికల సంఘం జారీచేసే సూచనలకు అనుగుణంగా 2024 శాసనసభ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎప్పటికప్పుడు జిల్లా ఎన్నికల అధికారి ద్వారా కేటాయించిన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను చేయడానికి నియోజకవర్గ ఈఆర్‌ఓలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సూచించారు. నోడల్ అధికారులను జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి పర్యవేక్షిస్తారని తెలిపారు. నోటిఫికేషన్ వచ్చిన తరువాత షెడ్యూల్ ప్రకారం ప్రణాళికబద్ధంగా పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్, డిఆర్‌ఓ సత్యనారాయణ రావు, నియోజకవర్గ ఈఆర్‌ఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



టీసీసీ రాయలసీమ డయాసిస్ పాలక వర్గ సభ్యులు

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామానికి చెందిన రెవ.పి.జాన్సన్‌బాబు టీసీసీ చర్చి రాయలసీమ డయాసిస్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. గ్రామంలోని టీసీసీ చర్చి వద్ద గురువారం టీసీసీ ఎన్నికల కమిషనర్ పి.సునంద్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో రెవ.పి.జాన్సన్ ప్రెసిడెంటుగా, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఇస్మాయిల్, శిఖామణి, జనరల్ సెక్రెటరీగా పి.ప్రసాద్(పల్లవోలు), జాయింట్ సెక్రెటరీగా వై.ప్రసాద్, ట్రెజరర్‌గా సురేష్‌బాబు(అగ్రహారం), ప్రి బింగ్ కన్వీనర్‌గా దేవ ఆశీర్వాదం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ గురువు సత్యరాజు, పల్లవోలు, రాజుపాళెం, చిన్న శెట్టిపల్లె, సింహాద్రిపురం, అగ్రహారం కామసముద్రం, పులివెందుల టీసీసీ చర్చిల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి



మాట్లాడుతున్న డీఈఓ శివ ప్రకాష్‌రెడ్డి

రాయచోటి: తరగతి గదిలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖఅధికారి శివప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రమైన రాయచోటిలోని మాసాపేట ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈవో తనిఖీకి వస్తున్న విషయం ఎవ్వరికి తెలియకపోవడంతో తరగతి గదిలో ఉండాల్సిన ఉపాధ్యాయులు లేరు. దీంతో 10వ తరగతి విద్యార్థినులకు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో హితబోధ చేశారు. అంతకుముందు డీఈవో ఒక్కరే తరగతి గదులన్నింటినీ కలియ తిరిగి తరగతుల నిర్వహణను పరిశీలించారు. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అక్కడికి చేరుకున్నారు. తరగతి గదిలో విద్యార్థులు చదువుకోకుండా అల్లరి చేస్తుండడంపై ఉపాధ్యాయులను మందలించారు. అనంతరం పదవ తరగతిలో టాపర్ల వివరాలను తెలుసుకుని వారితో సెల్ఫీ తీసుకున్నారు. తరగతి గది నిర్వహణ అతి సున్నితమైన అంశమని, దానిని ఎవ్వరూ అలక్ష్యం చేయకుండా బాధ్యతగా నిర్వహించాలని తెలిపారు. డీఈవో వెంట సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి కరుణాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అతివల శక్తి..ఆర్థిక అభివృద్ధి



వస్త్ర దుకాణంలో రేష్మా



పాదరక్షల దుకాణంలో ఆరీఫా

రూ.5లక్షలతో వస్త్ర దుకాణం

బి.కొత్తకోటకు చెందిన అత్తా కోడళ్లు కే.రేష్మా, కే.మహబూబ్‌బీలు ప్రతిభా మహిళా సంఘంలో సభ్యులు. వీరు వస్త్ర దుకాణం ప్రారంభించడానికి సంఘం నుంచి ఆర్థిక సహకారం ఆశించారు. 2019 జూన్‌లో గ్రామసమాఖ్య సంఘం కింద ఇద్దరికి రూ.లక్ష, నవంబర్‌లో స్త్రీ నిధి కింద రూ.2లక్షలు, బ్యాంకు ఇచ్చిన రుణంలో మహిళా సంఘం నుంచి ఆగస్టులో రూ.2లక్షల రుణం పొందారు. రూ.5లక్షలతో ప్రధాన రహదారిలో వస్త్ర దుకాణం నిర్వహిస్తూ ఆర్థికంగా ఎదిగారు. ఎంబ్రాయిడరీ, మహిళల డ్రస్ మెటీరిల్ విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. ఈ రుణాలు తీర్చివేయగా కొత్తగా అత్తాకోడళ్లు చెరో రూ.1.75 లక్షల బ్యాంకు లింకేజీ రుణాలు, వీఓ రుణం రూ.లక్షతో వ్యాపారంపై పెట్టుబడి పెట్టగా నెలకు రూ.20వేల ఆదాయం పొందుతున్నారు.

- సంఘాల ద్వారా రుణాలు
- సకాలంలో కంతులు చెల్లిస్తూ.. కుటుంబాల నిర్వహణ
- వ్యాపార, పాడి ద్వారా ఆదాయం
- 2023–24లో సంఘాలకు రూ.1,075 కోట్లు

మలుపు తిరిగిన జీవితం



ఈమె పేరు మంచూరి దుర్గ. కురబలకోట మండలం అంగళ్లు గ్రామంలోని పెద్ద దళితవాడ. ఆరేళ్లుగా శ్రీలక్ష్మి డ్వాక్రా గ్రూపులో లీడర్‌గా ఉంది. రెండేళ్ల క్రితం గ్రూపులో పాడి ఆవుల కోసం రూ.2 లక్షల రుణం తీసుకుంది. రూ.1.5 లక్షలతో రెండు పాడి ఆవులు కొన్నారు. రోజుకు 30 లీటర్ల పాలు వస్తున్నాయి. అమూల్ డెయిరీకి పాలు పోయడం ద్వారా నెలకు రూ.27 వేలు వస్తుంది.గతంలో రెక్కాడితేగాని డొక్కాడని ఈమె కుటుంబం ఇప్పుడు పాడితో వచ్చే ఆదాయంతో సంతోషంగా ఉంది.

పాదరక్షల దుకాణంతో ఉపాధి

బి.కొత్తకోటకు చెందిన ఆరీఫా మహిళా సంఘ సభ్యురాలు కావడంతో రూ.2 లక్షల రుణం మంజూరైంది. ఈ సొమ్ములో రూ.లక్షన్నర పెట్టుబడితో బి.కొత్తకోట మెయిన్‌రోడ్డులో పాదరక్షణ దుకాణం ప్రారంభించారు. సంఘం ద్వారా తీసుకున్న బ్యాంకు లింకేజీ రుణానికి ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా ద్వారా మూడు విడతల్లో 75వేల రుణాన్ని ప్రభుత్వం తిరిగి చెల్లించింది. తీసుకున్న రుణానికి చెల్లించిన రూ.15వేల వడ్డీని ప్రభుత్వమే సున్నా వడ్డీ పథకం కింద తిరిగి చెల్లించింది. ఈ మొత్తమే రూ.లక్షన్నర కావడంతో సంఘం నుంచి తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించేస్తూ వస్తోంది. నెలకు రూ.70వేల నుంచి రూ.లక్ష వ్యాపారం జరుగుతోందని, దీనిలో నెలకు కనీసం రూ.25 నుంచి రూ.30వేల ఆదాయం లభిస్తోందని ఆరీఫా అంటోంది.

బి.కొత్తకోట: జిల్లాలో మహిళా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మహిళా సంఘాలు బలమైన ఆర్థిక వ్యవస్థగా మారిపోయాయి. ప్రభుత్వ చేయూత, ఆర్థిక సహకారంతో ఇప్పుడు మహిళల కుటుంబాల ఆర్థిక పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. రుణాలు పొంది వాటి ద్వారా వ్యాపార, కుటీర పరిశ్రమలు, దుకాణాల నిర్వహణ తదితర కార్యకలాపాలతో ఆదాయ వనరులను పెంచుకొంటున్నారు. మహిళలకు రుణాలిస్తే ఏ ఇబ్బంది లేదని, దీనికి ప్రభుత్వ హామీ, వడ్డీ చెల్లింపు బాధ్యత ప్రభుత్వానిదే కావడంతో బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు జంకడం లేదు. మహిళలు క్రమం తప్పకుండా బ్యాంకులకు రుణాలు చెల్లిస్తున్నారు. ఫలితంగా రుణాల మంజూరు వేలకోట్లకు చేరింది.

రూ.వెయ్యి కోట్లు దాటింది

జిల్లాలో 30,405 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో 3,13,610 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీళ్లకు బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. డీఆర్‌డీఏ ద్వారా అధికారులు బ్యాంకులతో సంప్రదింపులు చేసి విరివిగా రుణాలు మంజూరు చేయిస్తున్నారు. ఒక్కో సంఘంలో పది మంది సభ్యులుంటే వారికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నారు. ఈ నిధులను సభ్యులు పంచుకొని వాటి ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 11,146 సంఘాలకు బుధవారం నాటికి రూ.1,075 కోట్ల రుణాలు అందించారు. ఇవికాక ఈ ఏడాదిలో ఇప్పటిదాక స్త్రీ నిధి కింద రూ.27,787 మంది మహిళలకు రూ.147.76 కోట్లు, ఉన్నతి పథకం కింద 1,843 మంది మహిళలకు రూ.9.18 కోట్ల రుణాలు అందించారు.

కల్యాణం.. కమనీయం

ఘనంగా కడప రాయుడి కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



మాంగల్య దర్శనం చేయిస్తున్న అర్చకులు

కడప కల్చరల్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆ దివ్య మంగళమూర్తి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో రంగురంగుల పూలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక అర్చకులు, యువ అర్చక బృందం కలిసి శాస్త్రోక్తంగా స్వామివారం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

సమ్మోహన రూపంలో ధగధగలాడే నూతన వస్త్రాలతో వరుడిగా స్వామి కొలువుదీరగా, మరోవైపు ముగ్ధ మనోహర రూపాలతో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు వధువులుగా ఒదిగి కూర్చొన్నారు. మంచి గంధం, మధుర పరిమళం, మంగళ వాయిద్యాల సుస్వరాలు భక్తులను మైమరిపిస్తుండగా భక్తులు రెండు కళ్లు చాలవన్నట్లు కల్యాణ క్రతువును తిలకించారు. కార్యక్రమంలో భాగంగా గణపతిపూజ, కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ, తదితర క్రతువుల అనంతరం అర్చకులు స్వామి పక్షాన అమ్మవారల గళసీమల్లో మంగళ సూత్రాలను అలంకరించారు. స్వామి ఎదుట ఉన్న అమ్మవార్లను ఇరువైపులా కొలువుదీర్చారు.

అనంతరం తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం లాజహోమం జరిపారు.ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, టీటీడీ అధికారులు, ఆలయ కమిటీల మాజీ చైర్మన్లు కల్యాణోత్సవాన్ని పర్యవేక్షించారు. తొలుత ఉభయదారులకు, అనంతరం భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి స్వామివారు గజవాహనంపై మాడ వీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. తలంబ్రాలలో వాడిన అక్షతల కోసం భక్తులు పెద్ద ఎత్తున ఎగబడ్డారు. నిర్వాహకులు వారికి అక్షతలతో పాటు ముత్యాల తలంబ్రాలను అందజేశారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

అక్రమ మద్యం స్వాధీనం

కలికిరి : అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ఆర్.మోహన్ తెలిపారు. కలికిరి సమీపంలోని నగిరిపల్లి క్రాస్ వద్ద ఓ దుకాణం నిర్వహిస్తున్న సతీష్‌రెడ్డి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తుండటంతో పోలీసులు దాడులు నిర్వహించారు. అతని వద్ద 21 మద్యం బాటిళ్లను గుర్తించి, వాటిని స్వాధీనపరచుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడులలో హెచ్‌సీ రాజేంద్రప్రసాద్, పీసీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

కలికిరి : ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డ ఘటన గురువారం రాత్రి కలికిరి పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మర్రికుంటపల్లి గ్రామం బోరెడ్డిగారిపల్లికి చెందిన సుబ్రమణ్యం రెడ్డి తన ద్విచక్రవాహనంలో కలికిరికి బయలుదేరాడు. చీకటిపల్లికి చెందిన సంజీవ తన ద్విచక్రవాహనంలో కలికిరి వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. వీరి వాహనాలు మార్గంమధ్యలోని పాళెంకురవపల్లి బస్టాప్ సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వారిద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారమిచ్చారు. అటుగా వెళుతున్న డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్, ప్రమాద సమాచారం తెలుసుకున్న సీఐ ఆర్.మోహన్ బాధితులను పరీక్షించి 108లో కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జాతీయ క్రికెట్ పోటీల్లో ప్రతిభ


శివకోటి (ఫైల్)

నందలూరు(రాజంపేట): నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లె గ్రామానికి చెందిన శివ కోటి జాతీయ స్థాయి వికలాంగ క్రికెట్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి నందలూరు కీర్తి ప్రతిష్టను మరోసారి పెంపొందించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ నగరంలో జరిగినటువంటి మూడవ మినీ నేషనల్ డిసేబుల్డ్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర రాష్ట్ర దివ్యాంగుల జట్టు రన్నరప్‌గా నిలిచిందన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టుతో చివరి వరకు పోరాడి ఓటమి పాలయ్యామని తెలిపారు. ఈ టోర్నమెంట్ తన వైస్ కెప్టెన్సీతో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి అటు బ్యాటింగ్‌లోను, ఇటు బౌలింగ్‌లోను 90 పరుగులు చేయడంతోపాటు 9 వికెట్లు తీసుకోవడం జరిగిందన్నారు. సెమీ ఫైనల్‌లో గుజరాత్ జట్టుపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకోవడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో ట్రోఫీ గెలుచుకుంటామని చెప్పారు. తనకు సహకరించిన కోచ్‌లకు, డేసీసీఏ నందలూరు సబ్ సెంటర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ వెలుగులు

- ఉమ్మడి జిల్లాలో 49 నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ల నిర్మాణం
- మొత్తం విద్యుత్ సర్వీసులు: 12,38,507


దుగ్గాయపల్లెలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్

వల్లూరు: రోజు రోజుకూ జిల్లాలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్నాయి. దానికి అనుగుణంగా అవసరమైన చర్యలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు చేపడుతోంది. క్షేత్ర స్థాయిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చేస్తోంది. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా అందించడమే ధ్యేయంగా చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి.

వ్యవసాయానికి పగటి పూట 9 గంటల సరఫరా

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయానికి పగటి పూట 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వాల హయాంలో విద్యుత్ శాఖపై నిర్లక్ష్యం వహించిన కారణంగా విద్యుత్ సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో వ్యవసాయానికి పగటి పూట 9 గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి మొదట్లో అవరోధాలు కలిగాయి. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం వాటిని అధిగమించడానికి చర్యలు చేపట్టింది. దీంతో క్రమంగా విద్యుత్ సరఫరా వ్యవస్థ మెరుగు పడుతూ వచ్చింది.

జిల్లాలో గణనీయంగా పెరిగిన విద్యుత్ కనెక్షన్లు

గత 5 సంవత్సరాలుగా జిల్లాలో వివిధ రకాల విద్యుత్ కనెక్షన్లు గణనీయంగా పెరిగాయి. 2019 ఏప్రిల్ 1 వ తేదీ నాటి నుంచి 2024 జనవరి 1 నాటికి జిల్లాలో వివిధ కేటగిరీల కింద 10,74,274 సర్వీసులు ఉండగా.. ఈ ఐదేళ్లలో 1, 64, 233 విద్యుత్ కనెక్షన్లు పెరిగి 12,38,507 సర్వీసులకు చేరుకున్నాయి. ఇందులో కేటగిరీ -1 కింద 1,06,781 గృహ కనెక్షన్లు పెరిగాయి. కేటగిరీ - 2 కింద 28, 365 కమర్షియల్ కనెక్షన్లు, కేటగిరీ - 3 కింద 508 పరిశ్రమల కనెక్షన్లు కేటగిరీ - 4 కింద 1, 823 గవర్నమెంట్ కనెక్షన్లు, కేటగిరీ - 5 కింద 26, 756 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెరిగాయి.

నూతన సబ్ స్టేషన్‌ల నిర్మాణం: లో ఓల్టేజీ సమస్యలు లేకుండా పరిశ్రమలు, గృహాలకు నిరంతర విద్యుత్ సరఫరా, వ్యవసాయానికి 9 గంటలు,.,గ్రామీణ ప్రాంతాలకు సైతం నిరంతర త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయడం మొదలైన లక్ష్యాలతో జిల్లా వ్యాప్తంగా నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ల నిర్మాణానికి శ్రీ కారం చుట్టారు. జిల్లాలో 2019 ఏప్రిల్ 1 నాటికి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లు మొత్తం 282 ఉన్నాయి. ఈ ప్రభుత్వం హయాంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో మొత్తం 49 నూతన సబ్ స్టేషన్లను మంజూరు చేయగా అందులో 41 సబ్ స్టేషన్‌లు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మరో 8 నిర్మాణ దశలో వున్నాయి.

ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో విద్యుత్ సబ్‌స్టేషన్ల వివరాలు

2019 నాటికి వున్న విద్యుత్ సబ్ స్టేషన్‌లు	5 ఏళ్లుగా నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్నవి	నిర్మాణంలో ఉన్నవి
282	41	8

విద్యుత్ కనెక్షన్ల వివరాలు-

1-4-19	కేటగిరీ-1	కేటగిరీ-2	కేటగిరీ-3	కేటగిరీ-4	కేటగిరీ-5
నాటికి	819803	72707	6018	14854	160892
1-1-24 నాటికి	926584	101072	6526	16677	187648
పెరిగినవి	106781	28365	508	1823	26756

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



జిల్లాలో ప్రతి సంవత్సరం 20 శాతం విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. గత సంవత్సరంలో రైతులకు సుమారు 13 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం. జిల్లాలో సుమారు లక్షా 90 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.వ్యవసాయానికి 9 గంటల పాటు పగటి పూట త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయడం, లో ఓల్టేజీ సమస్యలు లేకుండా నియంత్రించడం తదితర లక్ష్యాలతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ల నిర్మాణం చేపట్టాం. త్వరలో మారు మూల గ్రామాలకు సైతం నిరంతరం త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయడానికి వీలవుతుంది.

– ఎస్ రమణ, ఎస్ఈ, విద్యుత్ శాఖ

నేటి నుంచి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

నందలూరు(రాజంపేట) : నందలూరు మండలంలోని కుంపిణీపురం ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభం కానున్నాయి. రథసప్తమి సందర్భంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈ ఉత్సవాలకు కర్ణాటక రాష్ట్రం నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు రానున్నారు. జాగీరుదారుల ఆరాధ్యదైవమైన కుంపిణీపురం ఆంజనేయస్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధం చేశారు.

తొలి రోజున..

తొలిరోజున ఉదయం పంచామృతం, స్వామివారికి అభిషేకాలు, అనంతరం గరుడసేవ గ్రామోత్సవం నిర్వహించనున్నారు. రెండో రోజున శనివారం గ్రామోత్సవంతోపాటు తీర్థప్రసాద వినియోగం ఉంటుంది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆదివారం స్వామివారి రథోత్సవ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ రథోత్సవంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు.

బండలాగుడు పోటీలు

శనివారం బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు పలు ప్రాంతాల నుంచి ఎద్దులు రానున్నాయి. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.50 వేలును రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి అందజేయనున్నారు. కాగా ద్వితీయ బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాల్గో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ.5 వేలు ఉంటుందని నిర్వాహకులు సంబావు లక్ష్మయ్య, గణపతి శంకర్, సంబావు చంద్రశేఖర్‌లు తెలిపారు.

ఒంటిమిట్ట వైస్ ఎంపీపీ మృతి


జనార్ధన్‌రెడ్డి(ఫైల్)

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట వైస్ ఎంపీపీ గెడ్డం జనార్ధన్‌రెడ్డి(52) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని మంటపంపల్లి గ్రామానికి చెందిన గెడ్డం జనార్ధన్‌రెడ్డి కొంత కాలంగా కాలేయ సమస్యతో బాధపడుతూ ఉండగా వైద్యుల సూచన మేరకు.. నెల కిందట హైదరాబాదులోని కార్పొరేట్ ఆస్పత్రిలో కాలేయ మార్పిడి చేయించుకున్నారు. కానీ అప్పటి నుంచి శరీరం చికిత్సకు సరిగా స్పందించకపోవడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని హాస్పిటల్‌లో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి అత్యంత సన్నిహితుడైన గెడ్డం జనార్ధన్‌రెడ్డి మృతి చెందడంతో మేడా వర్గీయులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వైస్ ఎంపీపీ అకాల మరణం తెలుసుకున్న ఒంటిమిట్ట మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

నీటి మడుగులో వ్యక్తి మృతదేహం

– రాయచోటి పట్టణానికి చెందిన మహబూబ్ బాషాగా గుర్తింపు


మృతి చెందిన మహబూబ్ బాషా

రాయచోటి టౌన్ : రాయచోటి – గాలివీడు రోడ్డులోని మాండవ్య నదిలో పడి రాయచోటి పట్టణానికి చెందిన మహబూబ్ బాషా(47) అనే వ్యక్తి మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం నీటిపై మృతదేహం తేలియాడుతుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అర్బన్ పోలీసులు, ఫైర్ స్టేషన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు. మూడు రోజుల క్రితం నీటిలో పడి మృతి చెందినట్లు తెలుస్తోంది. శరీరంపై ఎలాంటి దుస్తులు లేకుండా ఉండటంతో అనుమానం రేకెత్తిస్తోంది. తరువాత సాయంత్రానికి రాయచోటి పట్టణానికి చెందిన వ్యక్తేనని మృతుడి బంధువులు చెప్పడంతో వివరాలు సేకరించారు. మహబూబ్ బాషాకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో సంచరిస్తూ ఉంటాడని బంధువులు తెలిపారు. నీటి మడుగులో ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉంటాడని వారు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నవశకం



నాడు-నేడుతో సౌకర్యాలు మెరుగు



ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు మెరుగుపడ్డాయి. ముఖ్యంగా ఐఎఫ్‌బీ ప్యానల్ ద్వారా విద్యార్థులకు ఎలాంటి కంటెంట్ అయినా విజువల్ రూపంలో చూపించవచ్చు. బయాలజీ సబ్జెక్ట్‌లోని పువ్వులు, ఆకుల అంతర్భాగం, చర్మం అడ్డు కోత, మానవ శరీరం భాగాలు ఇలాంటివన్నీ ఐఎఫ్‌బీ ప్యానల్స్ ద్వారా విద్యార్థులకు చాలా సులభంగా అర్థం అవుతాయి. అలాగే గూగుల్, యూ ట్యూబ్‌లో ఉండే కంటెంట్ వీడియోలు సైతం చూపించవచ్చు. ముఖ్యంగా బైజూస్ కంటెంట్ విద్యార్థులకు మరింత ఉపయోగపడుతుంది. నాడు-నేడు ద్వారా ఈ వసతులన్నీ మెరుగుపడ్డాయి. వాటిని ఉపయోగించడం వల్ల టీచింగ్ సులభంగా ఉండటంతోపాటు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

– రామిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, బయాలజీ అసిస్టెంట్, జెడ్పీ హైస్కూల్, పెద్దచెప్పులి, కమలాపురం మండలం

పిల్లలకు సాంకేతిక విద్య



నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా మా పాఠశాలకు సాంకేతిక విద్య అందించారు. పిల్లలకు డిజిటల్ విద్యలో భాగంగా బైజూస్ కంటెంట్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ) బోర్డులు ఏర్పాటు చేశారు. దీనివల్ల విద్యార్థులు డిజిటల్, సాంకేతిక విద్య నేర్చుకుంటున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చారు. పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేశారు. మౌలిక సదుపాయాలు కల్పించారు. దీంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతోంది.

– చింతపర్తి రాజారెడ్డి, ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

ఒకరి అరెస్ట్

బి.కొత్తకోట : కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని సీఐ సూర్యనారాయణ తెలిపారు. బి.కొత్తకోట సమీపంలోని బాలసానివారిపల్లెకు చెందిన ఎం.బాబు (49) ఇంటి వద్ద మద్యం ప్యాకెట్లు విక్రయిస్తుండగా దాడులు నిర్వహించామని సీఐ పేర్కొన్నారు. 96 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేశామని వివరించారు.

ఘనంగా సేవాలాల్ జయంతి


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బంజారాలు

మదనపల్లె : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ యావత్ భారతదేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్త అని, బంజారాల ఆరాధ్య దైవమని బంజారాలు అన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి సందర్భంగా మండలంలోని 7 తండాలకు చెందిన బంజారాలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఈశ్వరమ్మకాలనీ నుంచి నక్కలదిన్నె వరకు ర్యాలీ నిర్వహించారు. నక్కలదిన్నెలోని సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రక్తదాన శిబిరం, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంజారాల హక్కుల కోసం సంత్ సేవాలాల్ మహరాజ్ 18వ శతాబ్దంలో నిజాం మైసూర్ పాలకులపై వీరోచిత పోరాటం చేసిన యోధుడిగా గుర్తింపు ఉందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ఆయన చూపించిన మార్గం ఆదర్శనీయమన్నారు. సమాజానికి చేసిన సేవలు ఎనలేనివన్నారు. హిందూధర్మం గొప్పతనం బంజారాలకు తెలిపేందుకు జన్మించిన మహనీయుడిగా ఖ్యాతి పొందారన్నారు. తెలంగాణ ప్రభుత్వం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15ను సెలవుదినంగా ప్రకటించిందని, ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అయ్యో.. అప్పుడే నూరేళ్లు నిండాయా..!

- రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి
- కన్నీటి పర్యంతమైన తల్లిదండ్రులు

కడప అర్బన్ : సైకిల్‌పై వెళ్తున్న చిన్నారిని ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించింది. ఈ సంఘటన కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోచంపేటలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. 'అప్పుడే నూరేళ్లు నిండాయా.. కన్నా' అంటూ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప టూటౌన్ పరిధిలోని చిలకలబావికి చెందిన జబీవుల్లా, హసన్‌బేగంల కుమారుడైన షేక్ మహమ్మద్ మౌజుం(10) ఇంటి నుంచి సైకిల్‌పై బయటకు వచ్చాడు. అదే సమయంలో రోడ్డుపై యానాదికాలనీకి చెందిన నాగయ్య మట్టితో నిండిన ట్రాక్టర్‌ను నడుపుకొంటూ వచ్చి ఆటోను తప్పించబోయి, సైకిల్‌పై వస్తున్న బాలుడిని ఢీకొన్నాడు. దీంతో బాలుడు తీవ్రగాయాల పాలయ్యాడు. కొన ఊపిరితో వున్న చిన్నారిని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.


షేక్ మహమ్మద్ మౌజుం మృతదేహం


ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్

నందలూరు రైల్వే ప్రాముఖ్యతను గుర్తించండి!

– పీసీఈఈకి వినతి పత్రం సమర్పించిన సర్పంచ్


పీసీఈఈ మిశ్రాకు వినతి పత్రం సమర్పిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

రాజంపేట : ఉభయ వైఎస్సార్ జిల్లాలోని బ్రిటీష్ రైల్వే పాలకుల హయాం నుంచి ఉన్న నందలూరు రైల్వేకేంద్రం ప్రాముఖ్యతను గుర్తించాలని స్థానిక నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ సర్పంచి జంబు సూర్యనారాయణ కోరారు. నందలూరు రైల్వే కేంద్రం సందర్శనార్థం విచ్చేసిన దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీరు పీడీ మిశ్రా(సికింద్రాబాద్)ను ఆయన నందలూరు వాసులతో కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. తిరుపతి నుంచి ప్రత్యేక రైలులో నందలూరు రైల్వేకేంద్రానికి మిశ్రా చేరుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చెన్నై-ముంబయి రైల్వే మార్గంలో నీటి సౌకర్యం మెరుగ్గా ఉన్న రైల్వేస్టేషన్ నందలూరు అని తెలిపారు. రైల్వేబోర్డు నిబంధనల మేరకు నందలూరు రైల్వేకేంద్రం ఈ మార్గంలో మిడిల్ పాయింట్‌లో ఉందన్నారు. నందలూరులో అన్ని విధాలుగా వనరులు, సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఇటీవల రైల్వేబడ్జెట్‌లో నందలూరుకు రూ.3 కోట్ల రన్నింగ్‌రూం మంజూరు చేసినట్లు కేంద్రం తెలియజేసిందన్నారు. స్వాతంత్య్రం రాకముందు నుంచి ఉన్న స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ ప్రాంతంలో మోమో రెక్స్ మెయింటెన్స్‌కు ఎంపిక చేసుకునేందుకు అనుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏజీపీ షమీవుల్లాఖాన్, రైల్వేసాధన సమితి ప్రతినిధులు మట్టిబాబు, అక్కిరమణ, శివనరసింహులు, తుమ్మాది శివ తదితరులు పాల్గొన్నారు.

రన్నింగ్‌రూం అభివృద్ధి కోసం పరిశీలన

నాగిరెడ్డిపల్లెలోని నందలూరు రన్నింగ్‌రూం అభివృద్ధికి ద.మ.రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ ఎలక్ట్రికల్ ఇంజినీరు పీడీ మిశ్రా పరిశీలించారు. రన్నింగ్ రూం పరిసర ప్రాంతాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రన్నింగ్ స్టాఫ్‌నకు పడకల సామర్థ్యం పెంచాలని అధికారులను ఆదేశించారు. రన్నింగ్‌రూం సమీప స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైల్వేక్వార్టర్స్‌లో వీధిలైట్లు లేవని గుర్తించి, సకాలంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

సౌమ్యనాథాలయంలో పూజలు

దక్షిణభారతదేశంలో అతిపెద్ద వైష్ణవ ఆలయం అయిన నందలూరు సౌమ్యనాథాలయాన్ని పీసీఈఈ మిశ్రా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. గర్భాలయంలో మూలవిరాట్‌ను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయన వెంట సీనియర్ డీఈఈ వీరయ్య, సీనియర్ టీఆర్‌డీ సుదర్శన్‌రెడ్డి, ఎంసీ వేణుగోపాల్, సీఎల్ఐ పెంచలయ్య, ఓఎస్ మహబూబ్‌బాషా, స్టేషన్‌మేనేజరు కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.7 లక్షల డ్వాక్రా సొమ్ము స్వాహా

న్యాయం చేయాలని కోరుతున్న బాధిత మహిళలు


ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

కమలాపురం : కమలాపురం పట్టణానికి చెందిన సుమతి గ్రూపునకు చెందిన దాదాపు రూ.7 లక్షల వరకు సొమ్మును రీసోర్స్ పర్సన్, బ్యాంక్ కరస్పాండెంట్ చేతివాటం ప్రదర్శించి స్వాహా చేశారని, తమను ఆదుకోవాలని గ్రూప్ సభ్యులు లక్ష్మీనరసమ్మ, భార్గవి, ప్రశాంతి ఆవేదన వ్యక్తం చేశారు. వారు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సుమతి గ్రూపునకు చెందిన 10 మంది సభ్యులు స్థానిక ఏపీజీబీలో రూ.13 లక్షల రుణం తీసుకున్నారు. ప్రతి నెలా రూ.50 వేల చొప్పున 30 నెలల పాటు చెల్లించాల్సి ఉంది. అయితే గ్రూప్ లీడర్ ప్రతి నెలా కంతు బ్యాంకులో జమ చేయాల్సింది పోయి రీసోర్స్ పర్సన్(ఆర్‌పీ) చేతికి ఇచ్చేది. ఆమె బ్యాంక్ కరస్పాండెంట్ (బీసీ) చేతికి ఇచ్చేది. వారిద్దరూ కలసి ప్రతి నెల రూ.50 వేలు చెల్లించకుండా కొద్ది కొద్దిగా జమ చేస్తూ వచ్చారు. ఇలా 27 నెలలు గడిచిపోయింది. అయితే ఇటీవల జగనన్న ప్రభుత్వం విడుదల చేసిన వైఎస్సార్ ఆసరా నిధులు జమ చేస్తే తమ రుణం తీరిపోతుందనుకున్న సంఘ సభ్యుల ఆశ నిరాశైంది. బ్యాంకుకు వెళ్లి తమ రుణం తీరిపోయిందా అని అధికారులను అడిగి తెలుసుకుంటే.. అసలు విషయం బయట పడింది. గ్రూప్ సభ్యులందరూ కలసి ఆర్‌పీని అడిగితే.. ఆమె బీసీకి ఇచ్చానని, ఆమెను అడిగితే నాకు తెలియదు ఆర్‌పీని అడగండని ఒకరిపై ఒకరు పెట్టుకుంటున్నారని బాధితులు వాపోయారు. తాము కట్టిన డబ్బులు ఎవరు స్వాహా చేశారో తెలియడం లేదని, తమకు అధికారులు న్యాయం చేయకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యం అని వారు వాపోతున్నారు. మెప్మా, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తమకు న్యాయం జరగలేదని, అందుకే కలెక్టరేట్‌కు వెళ్లి గ్రీవెన్‌సెల్‌లో అలాగే కమలాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వారు గురువారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం పై మెప్మా ఏపీఎం లావణ్యను వివరణ కోరగా.. సుమతి గ్రూపునకు సంబంధించిన సొమ్ము స్వాహా జరిగిన మాట వాస్తవమేనన్నారు. అయితే గ్రూప్ లీడర్ బ్యాంక్‌కు వెళ్లి కంతు చెల్లించి ఉంటే ఇంత జరిగి ఉండేది కాదన్నారు. బ్యాంక్‌లో రూ.6.75 లక్షలు కట్టలేదని తేలిందన్నారు.